ఆహ్లాదం పంచుతున్న కేఆర్‌సీ ఎగ్జిబిషన్







బోడుప్పల్: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని ఉప్పల్ డిపో వద్ద ఏర్పాటు చేసిన కేఆర్‌సీ ఎగ్జిబిషన్ స్థానికులకు ఆహ్లాదం పంచుతోంది. ప్రతిరోజూ సాయంత్రం చిన్నారులు, పెద్దలు అనే తేడా లేకుండా సందర్శించి ఆనందాన్ని పొందుతున్నారు. నగర శివారు ప్రాంతంలో నిత్యం బిజీగా ఉండే ప్రజలకు ఈ ఎగ్జిబిషన్ ఆట విడుపుగా మారింది. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు నారాయణ తెలిపారు. తాజ్‌మహల్, ఎర్రకోట ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో పాటు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. జెయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, సోలాంబో, డ్రాగన్ ట్రెయిన్, బోట్ రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో రౌండ్ ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడకు వచ్చిన శివారు ప్రజలు ఎంజాయ్ చేస్తున్నారు. జ్యూవలరీ స్టాల్స్, రెడీమేడ్ స్టాల్స్, స్టాయిల్స్ స్టాల్స్, డ్రైఫ్రూట్ స్టాల్స్, ఆల్ వెరైటీ ఫుడ్ స్టాల్స్ మహిళలు, యువతుల మనసులను దోచేస్తున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 3 నుంచి రాత్రి 10గంటల వరకు నిర్వహిస్తున్న కేఆర్‌సీ ఎగ్జిబిషన్‌ను బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి, ఉప్పల్, ఘట్‌కేసర్, పోచారం ప్రాంత ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి సందర్శిస్తున్నారు.

భవానీనగర్ కాలనీని అభివృద్ధి చేస్తా



భవానీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులతో నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని భవానీనగర్ కాలనీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. భవానీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను శుక్రవారం కార్పొరేటర్ ఘనంగా సత్కరించారు. అనంతరం కాలనీలో పలు అభివృద్ధి పనులపై కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించి, కాలనీలో అన్ని రోడ్లను వేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచర్ల మధుసూదన్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు వై.సత్యనారాయణ, కృష్ణారెడ్డి, ఆనంద్‌కుమార్, భవానీ అశోక్, రాయుడు, శ్రీధర్‌రెడ్డి, సురేందర్, వీరా ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాలనీలో మరో కొత్త కాలేజీ వద్దు



నిరసన తెలుపుతున్న సాయినగర్ కాలనీవాసులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని న్యూసాయినగర్, సాయినగర్ కాలనీలో మైనార్టీ కాలేజీ ఏర్పాటు చేయవద్దంటూ కాలనీవాసులు శుక్రవారం మైనార్టీ కాలేజీ భవనం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సాయినగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బండి కన్వెన్షన్ హాల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పవన్‌రెడ్డి, 23వ డివిజన్ కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఇప్పటికే కాలనీలో ఉన్న నాలుగు కాలేజీలతో పార్కింగ్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. సరైన సౌకర్యాలు లేని బిల్డింగ్‌లో మరో కొత్త కాలేజీని ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా స్పందనలేదని అన్నారు. బీజేపీ నాయకులు జైపాల్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, సత్తయ్య, కాలనీవాసులు దేవేందర్, లోడె చంద్రయ్య గౌడ్, రమేష్ చారి, నరేష్, ఉపేందర్, జితేందర్‌రెడ్డి, సోమయ్య, శ్రీనివాస్, సింహాచలం, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నాలాల్లో పూడికతీత పనుల్లో వేగవంతం



నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

అల్వాల్: నాలాల్లో పూడికతీత పనులను వేగవంతం చేసినట్లు మచ్చబొల్లారం డీఈ కార్తీక్ అన్నారు. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని మూడు ప్రధాన ఓపెన్ నాలాల్లో, రుక్మిణి ఎన్‌క్లేవ్ నుంచి అల్వాల్ చెరువు వరకు, కౌకూర్ జనప్రియ నుంచి నాగిరెడ్డి కుంట వరకు, బొల్లారం రైల్వేస్టేషన్ నుంచి తుర్కపల్లి వరకు ఉన్న నాలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులను శుక్రవారం చేపట్టారు. ఏఈ రవళి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్రోజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చౌదరిగూడలో అక్రమ కట్టడాల కూల్చివేతలు

ఘట్‌కేసర్: చౌదరిగూడలో అక్రమంగా నిర్మించిన పలు కట్టడాలను పంచాయతీ కార్యదర్శి శశిధర్ శుక్రవారం కూల్చివేయించారు. గ్రామంలోని సాయిసురక్ష, వెంకటాద్రి టౌన్‌షిప్, ఓయూ కాలనీ, డాక్టర్ కాలనీలో అనుమతి లేకుండా నిర్మించిన కట్టడాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ అనుమతి లేని కట్టడాలు, ప్రభుత్వ భూమిలో నిర్మించిన కట్టడాలను వదిలేది లేదన్నారు.

పూడ్చేస్తూ.. నిర్మా‘నాలా’..?



ఉప్పల్ సర్కిల్ రాజ్‌నగర్ కాలనీలో నాలాను పూడ్చిన దృశ్యం



రాజ్‌నగర్ కాలనీలో నాలా పూడ్చి వేసిన షెడ్

- యథేచ్ఛగా కొనసాగుతున్న ఆక్రమణలు
- నోటీసులతోనే సరిపెడుతున్న అధికారులు
- 10 కాలనీలకు ముంపు ప్రమాదమే..
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీలవాసులు
- ఇప్పటికైనా స్పందించాలంటూ డిమాండ్

ఉప్పల్: నాలాలు, చెరువులు, కుంటలు, బఫర్ జోన్లను పరిరక్షించాలని ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉప్పల్ పర్యటనలో అధికారులుకు ఆదేశాలు జారీ చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వర్షాకాలం వస్తోంది.. నాలాల పూడిక తీసి వరద నీరు సాఫీగా వెళ్లేందుకు కృషి చేయాల్సిన అధికారులు ఉప్పల్‌లో మాత్రం అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు. ఏకంగా నాలాను మూసి నిర్మాణం చేపట్టినా పట్టించుకోవడం లేని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ సమయంలోనే స్థానికులు నేరుగా ఉప్పల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసి నాలాను కాపాడాలని వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది. సర్వే ఆఫ్ ఇండియా, ఉప్పల్ పారిశ్రామికవాడ, క్రికెట్ స్టేడియం ఎగువ భాగం నుంచి వచ్చే వరద నేరుగా ఉప్పల్ కేంద్రీయ విద్యాలయం -1 నుంచి మాస్టర్ చెఫ్ హోటల్ పక్క నాలా నుంచి ఉప్పల్ నల్ల చెరువులో కలవడానికి దాదాపుగా 30 ఫీట్ల నాలా విస్తరించి ఉంది. ఇది కాలక్రమేనా కుంచించుకుపోగా మిగిలిన నాలా నుంచే వరద నీరు ప్రవహిస్తోంది. నాలాపై ఉప్పల్ రాజ్‌నగర్ కాలనీ వద్ద ఓ వ్యక్తి తనకు ఉన్న స్థలంతో పాటు ఏకంగా నాలాను పూడ్చి నిర్మాణం చేపట్టారు. దీంతో వర్షాకాలంలో నాలాలో ప్రవహించాల్సిన వరద నీరు దాదాపు 10 కాలనీలను ముంచే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలాపై ఉన్న నిర్మాణాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయంపై ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులును వివరణ కోరగా ఇప్పటికే నోటీసుల ఇవ్వడం వంటివి పూర్తయ్యాయని అన్నారు. త్వరలో కూల్చివేసి నాలాను కాపాడతామని చెప్పారు. నాలాలను ఆక్రమిస్తే ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని స్పష్టం చేశారు.

సేవతోనే సంతృప్తి



గౌతంనగర్: సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి కలుగుతుందని మాజీ సైనికుడు పి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మిర్జాలగూడ రాజశ్రీనివాసనగర్‌లో పలువురు పేద మహిళలకు ఆయన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్థానికలు, మహిళలు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు



ఉప్పల్: హబ్సిగూడ 11 కేవీ ఫీడర్ మర్మతుల కారణంగా ఎన్‌జీఆర్ఐ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం కరెంటు సరఫరా ఉండదని ఏఈ రామిరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12.20 వరకు హబ్సిగూడ వీధి నంబర్ 3 నుంచి 7 వరకు కాకతీయ నగర్, హబ్సిగూడ మెయిన్ రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. నాచారం ఐఐసీటీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 గంట నుంచి 2.30 వరకు హరిజనబస్తీ, కాకతీయనగర్ పార్కు, హబ్సిగూడ వీధి నంబర్ 1, 2 తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదు. సీసీఎంపీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీఎస్‌టీ కాలనీ, భవానీ నగర్ వీధి నంబర్ 1 నుంచి 3 వరకు, రాజీవ్ నగర్, నాచారం పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బోడుప్పల్‌లోని పలు కాలనీల్లో..

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బోడుప్పల్‌లోని పలు కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ మైలారం స్వామి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరస్వతినగర్ ఫీడర్ పరిధిలో శ్రీనగర్ కాలనీ, సరస్వతినగర్, విజయపురి కాలనీ, శ్రీలక్ష్మినగర్, హనుమాన్ నగర్, ఉదయ్‌నగర్, అశోక్‌నగర్, ప్రశాంత్‌నగర్, శ్రీరాంనగర్, పెంటారెడ్డి కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బొల్లిగూడెం ఫీడర్ పరిధిలో బొల్లిగూడెం, రాజలింగం కాలనీ ఫేస్ 1, 2 మహాలక్ష్మినగర్, లక్ష్మారెడ్డి కాలనీ, సూరజ్‌నగర్, బాలాజీనగర్, టెలిఫోన్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులను చేపడుతున్నట్లు అయన వెల్లడించారు.

గణేష్‌నగర్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా..

రామంతాపూర్: విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని శనివారం గణేష్‌నగర్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల ఏడీఆర్ఎం ఆసుపత్రి, శారదానగర్, ఓల్డ్ రామంతాపూర్, చర్చి కాలని ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు ప్రగతినగర్, ఇందిరానగర్ మార్కండేయ స్వామి టెంపుల్, నెహ్రూనగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సబ్ స్టేషన్ ఏఈ రాములు తెలిపారు.

గౌతంనగర్‌లోని పలు ప్రాంతాల్లో..

గౌతంనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గౌతంనగర్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గౌతంనగర్ సబ్‌స్టేషన్ 11కేవీ దయానంద్‌నగర్, 11కేవీ ఉత్తంనగర్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి 12:30 వరకు మల్లిఖార్జుననగర్ పార్కు, గౌతంనగర్ పార్కు, దయానంద్‌నగర్, ఉత్తంనగర్‌లలో కరెంటు సరఫరా ఉండదని తెలిపారు.

చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా..

కుషాయిగూడ: చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం పలు ఫీడర్ల పరిధిలో కరంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సీహెచ్ అర్చన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏఎస్‌రావునగర్ సబ్‌స్టేషన్, ఎంజే కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలోని గాయత్రినగర్ రోడ్డు నంబర్లు 5-9, ఎంజే కాలనీ రోడ్డు నంబర్లు 1-6 కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మజీద్ 11కేవీ ఫీడర పరిధిలోని మారుతీనగర్, శ్రామిక్‌నగర, క్రియోటివ్‌నగర్ కాలనీల్లో మధ్యాహ్నం 12:30 గంటల నుంచి 2 గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా..

మల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు బెల్ కంపెనీ, పారిశ్రామికవాడలోని రోడ్-1 నుంచి రోడ్ నంబర్- 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు తెలిపారు. సూర్యనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సూర్యనగర్, మల్లికార్జున్‌నగర్, వెంకటరమణ కాలనీ, బ్యాంక్‌కాలనీ, ఛండీయానగర్ కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

నాచారం పారిశ్రామికవాడలో..

11 కేవీ నాగార్జున ఫెర్టిలైజర్స్ ఫీడర్, టైమ్స్ ఆఫ్ ఇండియా ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ నాగరాజు తెలిపారు. 11 కేవీ శ్రీకృష్ణ ఫార్మా ఫీడర్, బాలాజీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

చెంగిచెర్ల పరిధిలో..

మేడిపల్లి: 11కేవీ ఆర్‌టీసీ కాలనీ ఫీడర్ 33/11కేవీ చెంగిచెర్ల పరిధిలో చెట్ల కొమ్మల కటింగ్, మరమ్మతుల కారణంగా 11కేవీ ఆర్‌టీసీ కాలనీ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11గంటల నుంచి మధ్నాహ్నం 12.30 గంటల వరకు గణేష్‌నగర్, ఇంద్రానగర్, బృందావన్ కాలనీ, శివ గణేష్ నగర్, సుశీల టౌన్‌షిప్, మార అరవింద కాలనీ, సాయి రెసిడెన్సీ, వెంకటాద్రి నగర్, ఆదర్శ నగర్, ఆర్టీసీకాలనీ, రంగరంగయ్య నగర్ ఏరియాలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

- 33/11కేవీ మైవిల్లాస్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల కటింగ్ కారణంగా 11కేవీ మైవిల్లాస్ ఫీడర్ పరిధిలో శనివారం మధాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు కాకతీయ కాలనీ, సాయిబాబా కాలనీ, జయశ్రీ కాలనీ, చిన్న క్రాంతి కాలనీ, అరవింద ఎన్‌క్లేవ్, రాంక్రిష్టానగర్, మైవిల్లాస్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు మేడిపల్లి విద్యుత్ ఏఈ హరినాథ్ తెలిపారు.

అల్వాల్, మచ్చబొల్లారం సబ్‌స్టేషన్ పరిధిలో..

అల్వాల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా అల్వాల్, మచ్చబొల్లారం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి 12:30 వరకు 11కేవీ దినకర్‌నగర్ ఫీడర్ పరిధిలో దినకర్‌నగర్-9 నుంచి 24 వరకు, మధ్యాహ్నం 12:45 నుంచి 2:15 వరకు అల్వాల్ 24 హవర్స్ వాటర్ టాప్ ఫీడర్ పరిధిలో దినకర్‌నగర్-1 నుంచి 9 వరకు, జోషినగర్, తిరుమల సిటీ, రామచంద్రయ్య కాలనీ, మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మచ్చబొల్లారం 11కేవీ అయ్యప్ప నగర్ ఫీడర్ పరిధిలో ఎంహెచ్ఆర్ కాలనీ, ఎరుకల బస్తీ, ధర్మారెడ్డికాలనీ, లాపం గోడౌన్స్, ఎంఈఎస్ కాలనీ, ఆశాజ్యోతికాలనీ, గోపాల్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

సైనిక్‌పురి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో..

కాప్రా: విద్యుత్ మరమ్మతులు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపుతో సైనిక్‌పురి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పలు కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నరేందర్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు షాలివాహన, ఎల్లారెడ్డిగూడ, కాప్రా, తహశీల్దార్ కార్యాలయం, ఎస్టీ కాలనీ, కృష్ణానగర్, మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు సాధనవిహార్, సంఘమిత్ర ఎన్‌క్లేవ్, ప్రథమపురి కాలనీ, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వినాయక్‌నగర్, సాకేత్ రోడ్, హనుమాన్ నగర్, ఎన్ఆర్ఐ కాలనీ, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఎస్‌బీఓఏ కాలనీ, ఓయూటీ కాలనీ, భాస్కర్‌రావునగర్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ డివిజన్ ప్రెసిడెంట్ పదవికి గట్టిపోటీ

- ఆశావహుల్లో సుమారు 10 మందికిపైగా..
- సామాజిక వర్గాలుగా లెక్కలేసుకుంటున్న నేతలు
- యువతకు కేటాయించాలని వాదనలు
- అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందోనని ఆసక్తి



కాప్రా: ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ కమిటీలను రద్దు చేసింది. గత కమిటీలను రద్దు చేస్తూ త్వరలో నూతన కమిటీలను నియమించనున్నట్లు ప్రకటించింది. అయితే ఈ నేపథ్యంలో కాప్రా డివిజన్ అధ్యక్ష పదవికి గట్టి పోటీ నెలకొంది. ఈ డివిజన్‌లో అధ్యక్ష పదవికి ఆశావహులు చాలా మంది ఉన్నా ప్రముఖంగా కొందరి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కాప్రా డివిజన్ బీఆర్‌ఎస్ ప్రెసిడెంట్ పదవి కోసం దాదాపు 12 నుంచి 15 మంది పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో ముఖ్యంగా ఎం.కె.బద్రోద్దీన్, భైరి నవీన్‌గౌడ్, బంకా వెంకటేష్, కొండల్‌గౌడ్, కొప్పుల కుమార్, రవీందర్ రావు, గిల్‌బర్ట్, భైరి భాస్కర్‌గౌడ్, మహేష్, మైసయ్య, పల్లెపాటి భిక్షపతి, ఇంద్రయ్య పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే గత కమిటీలో ఓసీ సామాజిక వర్గానికి అధ్యక్ష పదవి కేటాయించారు. మరి ఈసారి ఏ సామాజిక వర్గానికి కేటాయిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం ఎస్సీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాల నుంచి ఎక్కువగా పోటీ నెలకొంది. మరోవైపు యువతకు ప్రాధాన్యం కల్పించాలనే వాదనలు కూడా ఉన్నాయి. బీసీ సామాజిక వర్గం నుంచి భైరి నవీన్‌గౌడ్, కొండల్ గౌడ్, భైరి భాస్కర్‌గౌడ్ పోటీలో ఉండగా ఎస్సీ సామాజిక వర్గం నుంచి మైసయ్య, ఇంద్రయ్య, గిల్‌బర్ట్ ఉన్నారు. మరి అధిష్టానం ఏ సామాజిక వర్గానికి అవకాశం కల్పిస్తుందనేది వేచి చూడాలి. అయితే మైనార్టీ నాయకుడైన ఎం.కె.బద్రోద్దీన్ కూడా ఆశావహుల్లో ఉన్నారని తెలుస్తోంది. కానీ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో హోంమంత్రిగా ఉన్న మహమూద్ అలీకి ముఖ్య అనుచరుల్లో ఒకరుగా ఉన్న బద్రోద్దీన్ రాష్ట్ర కార్యవర్గం, ఏదైనా నామినేటెడ్ పోస్టును ఆశించారు. కానీ ప్రస్తుతం పార్టీ అధికారంలో లేకపోవడంతో ఆ ఆశలు వదిలేసుకున్నట్లు తెలుస్తోంది. మరి ఆ స్థాయిని వదిలి తిరిగి డివిజన్ స్థాయికి వస్తారా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు యువతకు ప్రాధాన్యం ఇవ్వాలనే వాదనలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. యువతకు అవకాశం ఇస్తే భైరి నవీన్‌గౌడ్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. నవీన్‌గౌడ్ ప్రస్తుత ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రధాన అనుచరుడు. మొదటి నుంచి బీఎల్ఆర్‌కు వెన్నంటి ఉన్న నాయకుడు. ఎమ్మెల్యే కూడా నవీన్‌గౌడ్‌కే మొగ్గు చూపుతారని కూడా వార్తలు వినిపిస్తున్నాయి. మరోవైపు బంకా వెంకటేష్, కొండల్ గౌడ్, రవీందర్‌రావుతో పాటు మరికొందరు నేతలు రెండు, మూడు పర్యాయాలుగా అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకుని నిరాశపడి పార్టీ నిర్ణయం మేరకు పనిచేస్తూ వచ్చారు. ప్రస్తుతం వినిపిస్తున్న నేతలు మాత్రం డివిజన్ పార్టీ అధ్యక్ష పదవి ఆశిస్తున్నా పార్టీ అధిష్టానం అభీష్టం మేరకు పని చేస్తామని చెబుతున్నారు. ఇందులో ఎవరో ఒకరికి మాత్రమే అధ్యక్ష పదవి దక్కుతుంది. మరి ఇంతమంది పోటీ ఉండగా ఎవరిని బుజ్జగిస్తుంది, ఎవరికి కట్టబెడుతుంది అనేది ఉత్కంఠ నెలకొంది. పదవి ఆశించి భంగపడ్డవారు పార్టీ నిర్ణయం మేరకు పనిచేస్తారా, నిరాశతో రెబల్‌గా మారుతారా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. మొత్తానికి కాప్రా డివిజన్ అధ్యక్ష పదవికి గట్టి పోటీ నెలకొనడంతో ఎవరికి దక్కుతుందని ఆసక్తిగా మారింది.

పాఠశాల పేరుతో పుస్తకాల విక్రయం

- ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా
- గదిని సీజ్ చేసిన విద్యాశాఖాధికారులు



కుషాయిగూడలో గౌతమ్ మోడల్ స్కూల్‌లో గదిని సీజ్ చేస్తున్న విద్యాశాఖ అధికారులు

కుషాయిగూడ: పాఠశాల పేరుతో పుస్తకాలు ముద్రించి విక్రయిస్తున్నారంటూ ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు శుక్రవారం కుషాయిగూడలోని గౌతమ్ మోడల్ స్కూల్ ఎదుట ఆందోళన చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన గౌతమ్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేసి పాఠశాల ఎదుట బైఠాయించారు. ఈ విషయంపై కాప్రా మండల విద్యాశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది గౌతమ్ మోడల్ స్కూల్‌కు చేరుకొని పుస్తకాల విక్రయంపై విచారణ చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించి పుస్తకాలు విక్రయిస్తున్న గదిని అధికారులు సీజ్ చేసి హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలో జీవో నెంబర్-1ను పూర్తిగా తుంగలో తొక్కి కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యాపార కేంద్రాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారుల వైఫల్యం వల్లే కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలకు అదుపు లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం చొరవచూపి కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, కిరణ్, సతీష్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



కుషాయిగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించి సకాలంలో పనులు పూర్తి చేయాలని కార్పొరేటర్ ప్రభుదాస్ సూచించారు. మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ ఇందిరానగర్ కాలనీలో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. పనులు జరిగే క్రమంలో తగిన జాగ్రత్తలు పాటించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట దుర్గారెడ్డి, శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్

రామంతాపూర్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల ప్రవేశ పరీక్ష రామంతాపూర్ పరిధిలో ఏర్పాటు చేసిన ఆరు పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం ప్రశాంతంగా ముగిసిందని మేడ్చల్ జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్ వినయ్‌కుమార్ తెలిపారు. ఈ ఆరు పరీక్షా కేంద్రాల్లో 2,908 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 2,605 విద్యార్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు.